- **3 రాష్ట్రాలకు తీరిన రవాణా కష్టాలు**



ఏపీలోని నందవరం మండలం నాగల్‌దిన్నె సమీపంలోని తుంగభద్ర నదిపై రూ.42 కోట్లతో నిర్మించిన వంతెనను ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. తుంగభద్ర నదిపై నిర్మించిన నాగల్‌దిన్నె వంతెనతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు కష్టాలు తీరినట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అలంపూర్, ఎమ్మిగనూర్ ఎమ్మెల్యేలు విజయుడు, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. - అయిజ

# రైలుకిందపడి కౌలు రైతు ఆత్మహత్య

- ఆరు ఎకరాల్లో పత్తి సాగు
- దిగుబడి రాక.. అప్పులు తీరక మనస్తాపం
- వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో విషాదం



రమేశ్ (ఫైల్)

గీసుగొండ, డిసెంబర్ 20: రైలుకింద పడి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఊకల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. ఊకల్ గ్రామానికి చెందిన మొగసాని రమేశ్ (34) మూడేండ్లుగా ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో పత్తి పంట వేశాడు. ఆశించిన మేర దిగుబడి రాలేదు. వచ్చినదాంట్లో కొంత విక్రయించి, మరికొంత ఇంట్లో నిల్వ చేశాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలకు, పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు దాదాపు రూ.10 లక్షల వరకు ఉండటంతో వాటిని తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. దీంతో బుధవారం మండలంలోని ధర్మారం రైల్వేగేటు సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బిగ్‌బాస్ 7 విజేత పల్లవి ప్రశాంత్ అరెస్ట్

**నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు**



బంజారాహిల్స్, డిసెంబర్ 20: బిగ్‌బాస్ 7 సీజన్ విజేత పల్లవి ప్రశాంత్, అతడి సోదరుడు మనోహర్‌ను బుధవారం సాయంత్రం జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలోని కొలుగూరు గ్రామంలోని తన ఇంట్లో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బిగ్‌బాస్ ఫైనల్ నేపథ్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియో వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. టైటిల్ విజేతగా నిలిచిన ప్రశాంత్ స్టూడియోస్ నుంచి బయటికి రాగా, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అదే సమయంలో రన్నరప్‌గా నిలిచిన అమర్‌దీప్ సైతం బయటకు రాగా, ఇరువురి అభిమానుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కొందరు అనుదీప్ కారుపై రాళ్లు విసిరేందుకు ప్రయత్నించారు. మరో పోటీదారు అశ్విని కారు అద్దాలను పగులగొట్టారు. రోడ్డుపై వెళ్తున్న 6 ఆర్టీసీ బస్సుల అద్దాలు ధ్వంసం చేశారు. బందోబస్తుకు వచ్చిన పంజాగుట్ట ఏసీపీ కారు అద్దంతోపాటు విధులు నిర్వహించడానికి వచ్చిన బెటాలియన్ బస్సు అద్దాన్ని పగులగొట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా ప్రశాంత్, ఏ2గా మనోహర్, ఏ3గా అతడి స్నేహిడుతు వినయ్‌ను చేర్చారు. ఇప్పటికే ఏ4గా ఉప్పల్‌కు చెందిన సాయికిరణ్, అంకిరావుపల్లి రాజును అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా ప్రశాంత్, మనోహర్‌తో పాటు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని గురువారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

# మన చేనేత ఆవిష్కర్తకు జాతీయ స్థాయిలో గుర్తింపు

**హ్యాండ్లూమ్ లిఫ్టింగ్ వీవింగ్ యంత్రానికి మోదా శివకుమార్ రూపకల్పన**

**ఐఐఎం అహ్మదాబాద్ పోటీల్లో తెలంగాణ ఆవిష్కరణకు మొదటి స్థానం**



మోదా శివకుమార్ తయారు చేసిన హ్యాండ్లూమ్ లిఫ్టింగ్ వీవింగ్ మెషీన్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ గ్రామీణ ఆవిష్కర్తకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు దక్కింది. మోదా శివకుమార్ రూపొందించిన 'హ్యాండ్లూమ్ లిఫ్టింగ్ వీవింగ్ మెషీన్' ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) అహ్మదాబాద్ నిర్వహించిన 'ఇన్నోవేషన్ ప్లే గ్రౌండ్' పోటీల్లో ఉత్తమ ఆవిష్కరణగా ఎంపికయ్యింది. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్స్ అగ్మెంటేషన్ నెట్‌వర్క్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ఆవిష్కర్తలు తమ నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. మొదటి స్థానాన్ని పొందిన ఆవిష్కరణకు 50 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా విజేత మోదా శివకుమార్ మాట్లాడుతూ హ్యాండ్లూమ్ లిఫ్టింగ్ వీవింగ్ యంత్రాన్ని ఈ స్థాయికి తీసుకురావడంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ) ఎంతో కీలకంగా వ్యవహరించిందని చెప్పారు.

> **తెలంగాణకు గర్వకారణం**
>
> తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో చాలా మంది గ్రామీణులు సరికొత్త ఆవిష్కరణలను చేసేందుకు ముందుకు వస్తున్నారు. నేత వృత్తిలో కార్మికులు ఎదుర్కొనే సమస్యకు శివకుమార్ ఆవిష్కరణ ఒక చక్కని పరిష్కారం. హ్యాండ్లూమ్ లిఫ్టింగ్ వీవింగ్ మెషీన్ వినియోగంలోకి వస్తే సంప్రదాయ చేనేత పరిశ్రమల్లో మార్పు వస్తుంది. ఈ ఆవిష్కరణతో శివకుమార్ ఎంతో మందిలో స్ఫూర్తి నింపారు.
>
> -శాంత తౌటం (సీఐవో, టీఎస్ఐసీ)

# చేపల వేటకు వెళ్లి తండ్రీకొడుకు మృతి

**సంగారెడ్డి జిల్లాలో విషాదం**

హత్నూర, డిసెంబర్ 20: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి తండ్రీకొడుకు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లానగర్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్కల ప్రభు (46), చెక్కల నాగరాజు (23) తండ్రీకొడుకులు. వీరు మంగళవారం సాయంత్రం తుర్కలఖానాపూర్ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో వారు ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడటంతో చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తెల్లవారుజామున మృతదేహాలు చెరువులో తేలాయి. హత్నూర ఎస్సై సుభాష్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వీ సునీతాలక్ష్మారెడ్డి ఏరియా దవాఖానకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రేమ పేరిట ఉపాధ్యాయుడి మోసం

- ఇద్దరితో వేర్వేరుగా ప్రేమాయణం
- 3 రోజుల క్రితమే ఒకరితో పెండ్లి
- పెంచికల్ పేట్ ఠాణాలో కేసు



మూడు రోజుల క్రితం ఓ యువతిని పెండ్లి చేసుకున్న భరత్‌రత్న

పెంచికల్ పేట్, డిసెంబర్ 20: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చాడో ప్రబుద్ధుడు. తరగతి గదుల్లో పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్ది, ఉన్నతమైన గౌరవం పొందాల్సిన ఈ ఉపాధ్యాయుడు.. ప్రేమ పేరిట ఇద్దరు యువతులను వంచించాడు. ఇందులో ఒక యువతిని పెండ్లి చేసుకోగా.. మరొకరితో వివాహేతర సంబంధం విషయం వెలుగులోకి వచ్చింది. మరో ఇద్దరు కూడా ఆయన ట్రాప్‌లో పడినట్టు ఉపాధ్యాయవర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతున్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన భరత్‌రత్న టీఆర్టీ ద్వారా 2017లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతితో మూడేండ్లుగా ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి పెండ్లి చేసుకోవాలని అడగగా.. ఏడాదిలోగా చేసుకుంటానని అగ్రిమెంట్ రాసిచ్చాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు అడిగినా మాట దాటేస్తూ వస్తున్నాడు. ఇంతటితో ఆగకుండా.. తాను పనిచేస్తున్న పెంచికల్‌పేట్ మండలంలోని మరో యువతితో కూడా ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఈ నిర్వాకం బయటకు రావడంతో యువతి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు యువతిని ఈ నెల 18న పెండ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రానికి చెందిన యువతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను మోసం చేశాడని గోడు వెళ్లబోసుకున్నది. ఆమె ఫిర్యాదుతో భరత్‌రత్నపై మోసం (చీటింగ్), లైంగిక దాడి కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ రాజు తెలిపారు. సదరు ఉపాధ్యాయుడి లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### భవిష్యత్తు అవసరాలు తీర్చే కోర్సులపై దృష్టిపెట్టాలి

అమీర్‌పేట్, డిసెంబర్ 20 : భవిష్యత్తు అవసరాలు తీర్చే కోర్సులపై దృష్టిపెడుతూ, ఆధునిక సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని తమిళనాడు రాష్ట్ర సమాచార, సాంకేతిక డిజిటల్ సేవల శాఖ మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని హోటల్ మారిగోల్డ్‌లో బుధవారం ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రిడ్జ్-23 సదస్సులో మంత్రి పళనివేల్ త్యాగరాజన్ మాట్లాడుతూ.. మారుతున్న డిమాండ్లకు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని విద్యా సంస్థలకు సూచించారు. పలు కోర్సులపై విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్న ఐసీటీ అకాడమీ సేవలను ఆయన అభినందించారు.

### నిఫ్ట్ ప్రవేశాల దరఖాస్తుకు 3న తుది గడువు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీల్లో (నిఫ్ట్) ప్రవేశాలకు జనవరి 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 60 పట్టణాలో పరీక్షను ఫిబ్రవరి 5న నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ద్వారా హైదరాబాద్ సహా అన్ని నిఫ్ట్‌లలోని యుజీ, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

### జనవరి 1 నుంచి డీఈఐఈడీ ఫస్టియర్ పరీక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) ఫస్టియర్ వార్షిక పరీక్షలను 2024 జనవరి 4 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు వెల్లడించారు. అభ్యర్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

### పలు స్కూళ్లలో మాస్కులు మస్ట్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కరోనా వ్యాప్తి నేపథ్యంలో పలు పాఠశాలలు అప్రమత్తమవుతున్నాయి. గురువారం నుంచి విద్యార్థులకు మాస్కులు తప్పనిసరి చేశాయి. ఈ మేరకు ప్రిన్సిపాళ్లు తల్లిదండ్రులకు పలు సూచనలిచ్చారు. సామాజిక దూరం పాటించాలని, శానిటైజర్లు వాడాలని, చిన్నారులు ఏవైనా ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడితే టీచర్లకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్‌లోని ఓ స్కూల్ యాజమాన్యం తెలియజేసింది.

### జనవరి 22, 23న టీ హబ్‌లో క్లీన్ ఎనర్జీ హ్యాకథాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌లో క్లీన్ ఎనర్జీ హ్యాకథాన్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నుమాలిగల్ రిఫైనరీ లిమిటెడ్‌తో కలిసి ఈ హ్యాకథాన్‌ను జనవరి 22, 23న నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ఆసక్తి ఉన్నవారు https://bit.ly/3v0lUeE లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, హ్యాకథాన్‌లో విజేతగా నిలిచిన వారికి రూ.5లక్షల వరకు నగదు బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు.

### గురుకుల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

హైదరాబాద్, డిసెంబర్20 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్‌కు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఆయనకు అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి దయాకర్ వినతిపత్రం అందజేశారు.

### డీఎంఈగా త్రివేణి.. డీపీహెచ్‌గా రవీందర్‌నాయక్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), ప్రజారోగ్య సంచాలకులను (డీపీహెచ్) ప్రభుత్వం మార్చింది. రమేశ్‌రెడ్డి స్థానంలో డాక్టర్ త్రివేణిని ఇన్‌చార్జి డీఎంఈగా నియమించింది. ఆమె ప్రస్తుతం ఉస్మానియా దవాఖానలో పనిచేస్తూ, అడిషనల్ డీఎంఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరో అడిషనల్ డీఎంఈ కే శివరాంప్రసాద్‌ను ఇన్‌చార్జి డీఎంఈ (అకడమిక్)గా నియమించింది. ప్రస్తుతం ఆయన జగిత్యాలలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్నారు. వారిద్దరూ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీపీహెచ్ గడల శ్రీనివాసరావు స్థానంలో ప్రభుత్వం డాక్టర్ శివరాంనాయక్‌ను ఇన్‌చార్జి డీపీహెచ్‌గా నియమించింది. లెప్రసీ విభాగం డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, వైద్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

